క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.54 వేలు విరాళం



దాత రేవంత్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు తన మొదటి జీతం రూ.54,334 విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన ఇమ్మడి జానకి రామ వెంకట రేవంత్ ముందుగా తన తల్లిదండ్రులు రత్నాజీ, భాగ్యరత్నంలతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నాడు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేయగా, దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజా రావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం హనుమద్ హోమం అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా జరిపారు. కార్యక్రమాన్ని ఆలయ పర్యవేక్షకులు రాజ్‌కుమార్ పర్యవేక్షించారు. ప్రతి ఆదివారం హనుమద్ హోమం జరుగుతుందని, ఆర్జిత సేవగా నిర్ణయించిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని శారీరిక, మానసిక ప్రశాంతతను పొందాలని ఈవో ఆర్‌వీ చందన కోరారు.

200 మందికి హోమియో వైద్యసేవలు

పోలవరం రూరల్: మండలంలోని పట్టిసీమ గ్రామంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ గీతాశ్రమంలో నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 200 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సొంత సొమ్ముతో రహదారి గుంతల పూడ్చివేత



రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న మద్దిపాటి

కామవరపుకోట: ఆడమిల్లి శివారులో రహదారి గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో స్పందించిన స్థానిక వైఎస్సార్ సీపీ నేత మద్దిపాటి భీమేశ్వరరావు తన సొంత సొమ్ములు ఖర్చు చేసి జేసీబీ సహాయంతో గుంతలు పూడ్చారు. దీనితో స్థానికులు ఆయన్ను అభినందించారు.

రక్త పింజరి హతం



రక్తపింజరిని హతమార్చిన గ్రామస్తులు

కొయ్యలగూడెం: గంగవరం గ్రామంలోని హెచ్‌పీ గ్యాస్ సమీపంలో భారీ రక్త పింజరి పామును ఆదివారం గ్రామస్తులు హతమార్చారు. రక్తపింజరి సుమారు ఏడు అడుగుల వరకు ఉంది. రాత్రి సమయంలో కొందరు గ్రామస్తులు వారి పనులు ముగించుకుని ఇంటికి వచ్చే సమయంలో పాము రోడ్డుపై ఉండడం చూసి గ్రామస్తులు భయాందోళనకు గురై వెంటనే హతమార్చారు. మూడు కూడలి సెంటర్ నుంచి గంగవరం గ్రామంలోకి వచ్చే మార్గంలో వీధిలైట్లు లేకపోవడంతో ఇక్కడ చీకటిగా ఉంటుందని, ఇక్కడ నిత్యం విష సర్పాలు సంచరిస్తున్నాయని, ఈ మార్గంలో నడవాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గమ్యానికి చేరవలసి వస్తుందని గ్రామస్తులు తెలియజేశారు. ఇప్పటికైనా పంచాయతీ వారు స్పందించి రోడ్డుకి ఇరువైపులా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ సేవలు నిలుపుదల

దెందులూరు: ఆంధ్ర గ్రామీణ బ్యాంకులో ఈ నెల 11 సాయంత్రం 6 గంటల నుంచి 15వ తేది సాయంత్రం 6 గంటల వరకు బ్యాంకు సేవలు నిలుపుదల చేస్తామని బ్యాంక్ మేనేజర్ నాగార్జున అన్నారు. ఆదివారం దెందులూరు బ్యాంక్ సప్తగిరి గోదావరి బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అవుతున్న నేపథ్యంలో మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ యూపీఐ ఇతర సేవలు తాత్కాలికంగా పని చేయవని వినియోగదారులు, ఖాతాదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ఏలూరు రూరల్: ప్రకృతి సేద్యంతో రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయశాఖ డీపీఎం వెంకటేష్ అన్నారు. ఆదివారం వ్యవసాయాధికారులు ఏలూరు పరిసర ప్రాంతం పోణంగిలో రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే సాగు పెట్టుబడి తగ్గుతుందన్నారు. పురుగుమందులు, ఎరువుల వాడకం తగ్గించడం వల్ల ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయవచ్చన్నారు. వరి చేలపై తెగుళ్ల నివారణకు ద్రావణ తయారీపై అవగాహన కల్పించారు.

కలిసిరాని ఖరీఫ్ కాలం



తెల్లంవారిగూడెం సమీపంలో వేసిన మినప పంట



దుద్దుకూరు సమీపంలో ప్రత్తి పంటను చదును చేసుకుంటున్న రైతులు

- మరో 20 రోజుల్లో ముగియనున్న ఖరీఫ్ సీజన్
- ఇప్పటికే లక్ష్యానికి దూరంగా సాగు
- యూరియా దొరకక రైతుల అవస్థలు

బుట్టాయగూడెం: ఈ ఏడాది రైతులకు ఖరీఫ్ సీజన్ కలిసిరానట్లు కనిపిస్తోంది. ఈ సీజన్ ప్రారంభానికి ముందు వర్షాలు పలకరించినా ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. దీనితో రైతులు సాగు చేసేందుకు అనేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వర్షాధారం మీద ఆధారపడ్డ రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ఇటీవల అల్పపీడనం ఏర్పడినప్పటికీ గిరిజన ప్రాంతంలో సరైన వర్షాలు కురవలేదు. దీనితో అనేక చోట్ల పంటలు వేయకుండానే ఖాళీ భూములు ఉన్నాయి. పలుచోట్ల బోర్లు ఉన్న రైతులు వరి, మినుము, మొక్కజొన్న వంటి పంటలను వేశారు.

లక్ష్యానికి దూరంగా సాగు

కేఆర్‌పురం ఐటీడీఏ సబ్ డివిజన్ పరిధిలో సాధారణ పరిస్థితుల్లో వరిసాగు 37,540 ఎకరాలు కాగా ఇప్పటివరకూ సుమారు 75 శాతం మాత్రమే వరి నాట్లు పడినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వేరుశనగ, మినుము, ప్రత్తి పంటలతో కలిపి మొత్తం 50,909 ఎకరాలకు గానూ 27,650 ఎకరాలు మినుము, వేరుశనగ, ప్రత్తి పంటలు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు పొగాకు నారుమడులను కూడా ఇప్పటికే పెంచుతున్నారు. మరో 20 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగ్గుస్తున్నా యూరియా కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో ఉన్న సొసైటీల్లో యూరియా నామమాత్రంగానే ఉందని పలువురు వాపోతున్నారు.

సరైన వర్షాలు లేక తగ్గిన సాగు



గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది సరైన వర్షాలు లేక సాగు తగ్గినట్లు కనిపిస్తోంది. దీనికితోడు యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి.

– ఆరేటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బుట్టాయగూడెం

యోగాసన విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న వాసుబాబు, చినిమిల్లి వెంకట్రాయుడు

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని కాపు కల్యాణ మండపంలో రెండురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు ఆదివారం బహుమతులను అందజేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5, 6 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరిగిన సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో దాదాపు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో గెలుపొందిన విజేతలను 50వ జాతీయ యోగాసన చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసుబాబు, వెంకట్రాయుడు విజేతలకు బహుమతులను ప్రదానంచేసి, అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, కాపు కల్యాణ మండప స్థలదాత పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణారావు, కల్యాణ మండప ట్రస్ట్‌బోర్డు ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు, బోర్డు సభ్యుడు పాశం రామాంజనేయులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘ కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన జిల్లా కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఫొటోగ్రాఫర్స్ యూనియన్ల నాయకులు

ద్వారకాతిరుమల: ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం స్థానిక బంగారుతల్లి కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కేవీ రమణారావు, కార్యదర్శిగా ఎస్ ప్రదీప్ కుమార్, ట్రెజరర్‌గా పీవీఆర్ మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.సూరిబాబు, కన్వీనర్‌గా ఎస్‌డీ అంజాద్ ఖాన్, పీఆర్‌వోగా జె.సిద్దయ్య, అలాగే ద్వారకాతిరుమల మండల ఫొటో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడిగా వి.గోపి, కార్యదర్శి జి.విలియమ్స్, ట్రెజరర్‌గా డి.పవన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎంఎల్ రమణి, రాష్ట్ర ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ మాదాల రమేష్, రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా నాగరాజు, రాష్ట్ర కోశాధికారి చిలంకుర్తి శేషు, పలు మండలాలకు చెందిన ఫొటోగ్రఫీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత పోటీలు



పోటీల్లో విజేతలను అభినందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన సంగీత పోటీలు ప్రేక్షకులకు ఆకట్టుకున్నాయి. తొలుత అకాడమీ డైరెక్టర్ ఎస్‌పీఎస్ వాసు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లోని ఎందరో కళాకారులకు వివిధ గాత్ర, వాద్య పరికరాలపై శిక్షణ అందించి వారిని తీర్చిదిద్ది సంగీత రంగానికి అందిస్తున్నామన్నారు. గత 23 సంవత్సరాలుగా సంగీత కళా సేవ నిర్వహిస్తూ నైపుణ్యం ఉండి అవకాశాలు లభించక మరుగున పడిపోతున్న సంగీత కళాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా పాడనా తీయగా అనే పాటల పోటీల కార్యక్రమం నిర్వహిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో విజేతల వివరాలను ప్రకటించారు. జూనియర్స్ విభాగంలో వై.నాగ సంహిత, ఎల్.శాశ్విత్, జి.ఆద్య శ్రీనిధి వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అలాగే సీనియర్స్ విభాగంలో ఎం.నిరీష ప్రథమ, ఎం.సాయి శ్రీలాస్య ద్వితీయ, సీహెచ్ రాజేష్ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలు కాలేకపోయిన వారి నుంచి మంచి గాత్రం కలిగిన వారిని ఎంపిక చేసి పాడనా తీయగా సీజన్–3లో అవకాశం కల్పిస్తామని కార్యక్రమ కన్వీనర్ వహీదా వాసు తెలిపారు.

సంఘటితంతోనే కార్మికుల హక్కుల అమలు



మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

కొయ్యలగూడెం: కార్మికులంతా తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడి సాధించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఆదివారం ఏఐటీయూసీ సమావేశం మండల సీపీఐ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు అధ్యక్షతన ఏఎంసీ యార్డులో నిర్వహించారు. 24 గంటలు పని ఒత్తిడి తగ్గించాలని ఆనాడు కార్మికులంతా ఒక్కటై పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలు ఇప్పుడు అమలవుతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరలా కార్మికులకు 12 గంటలు పని దినాలు చేయడానికి సిద్ధపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యతగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కారం ధారయ్య, దుగ్గిరాల నారాయణరావు, వెలగల నాని, పులపాకుల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల మూత



శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి గాలి గోపుర ద్వారం మూసివేసిన దృశ్యం

కొయ్యలగూడెం: రాహుగ్రస్త చంద్రగ్రహణ ప్రభావం వలన ఆదివారం సాయంత్రం నుంచి హైందవ ఆలయాలను మూసి వేశారు. టెంపుల్స్ సెంటర్లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రధాన ద్వారాన్ని శాస్త్రోక్తంగా మూసి వేశారు. అదేవిధంగా సత్యభామ సమేత మదన గోపాల స్వామి, కన్నాపురం, అంకాలగూడెం, కొయ్యలగూడెం, యర్రంపేట, పులివాగు శివాలయాలతో సహా మొత్తం పద్దెనిమిది పంచాయతీల పరిధిలోని ఉన్న నిత్యధూప దీప నైవేద్యాలు చేసే ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ప్రజలు సైతం గ్రహణ ప్రభావం పడకూడదని పండితులు సూచన మేరకు దర్బలు తీసుకువెళ్లి తమ ఇళ్లలోనీ పూజా మందిరాలు, తినుబండారులపై ఉంచారు.

ఎఫ్ఎస్ఓ నాగవాసుకి సత్కారం



నాగ వాసు నాయుడుని సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంకి చెందిన సుంకర నాగ వాసునాయుడు జంగారెడ్డిగూడెం అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఎస్ఓగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జర్మనీలో జరిగిన వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్ 2025లో రెండవ స్థానంలో నిలిచి రజత పతకం సాధించిన సందర్భంగా ఆదివారం ఆయన్ను సత్కరించారు. స్థానిక వీఎస్ఎన్ స్కూల్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మానవత మండల శాఖ అధ్యక్షుడు మందపాటి రామకృష్ణ మాట్లాడుతూ నాగ వాసు ఐదు కిలోమీటర్ల రేస్ వాక్ విభాగంలో వెండి పతకం సాధించి భారత దేశ ఖ్యాతిని పెంచారని కొనియాడారు. కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు మందపాటి రామకృష్ణ, కార్యదర్శి ఆగిరిపల్లి చంటి, సభ్యులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువు

భీమడోలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి జనసేన వర్గం దళితులపై దాడులు చేస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో ఆయన ఆదివారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కైకలూరు మండలం దానగూడెం గ్రామంలో దళితులపై దాడి చేసిన జనసేన నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని, వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నరకానికి రహదారి

- ప్రమాదకరంగా కొవ్విడి రహదారి
- గత ప్రభుత్వంలో రూ.3 కోట్లతో నిర్మాణం
- నిర్వహణ లోపంతో గుంతల మయం
- అడుగడుగునా కుంగిపోతున్న రోడ్డు మార్జిన్లు



ప్రమాదకరంగా మారిన గణపవరం–క్రొవ్విడి ఆర్అండ్‌బీ రహదారి



బావాయిపాలెం మలుపులో కుంగిపోతున్న రోడ్డు మార్జిన్

నిడమర్రు: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన క్రొవ్విడి ఆర్అండ్‌బీ రోడ్డు నిర్వహణ లోపంతో రెండేళ్లలో అడుగడుగునా ప్రమాదకరంగా తయారైంది. 2023కి ముందు దశాబ్ద కాలంగా అధ్వానంగా ఉన్న ఈ రహదారిని నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో నూతన రహదారి నిర్మాణం పూర్తి చేసుకుంది. అనంతరం ప్రభుత్వం మారింది కానీ ఈ రహదారి వెంబడి కనీస నిర్వహణ మరమ్మతులు నిర్వహించకపోవడంతో ఈ రహదారి వెంబడి పలు చోట్ల రోడ్డు మార్జిన్లు కుంగిపోయి ప్రమాదకరంగా తయారైంది. దీంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడం ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా రోడ్డు మార్జిన్లు కుంగిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎదురెదురు వాహనాలు తప్పించుకోవడంలో ప్రాణాల మీదకు తెచుకుంటున్నారు. ఇందిరమ్మ కాలనీ, గ్రామ దేవత గుడి, చైతన్య స్కూల్, క్రొవ్విడి మలుపు, క్రొవ్విడి–ఉప్పరగుడెం వంటి ప్రాంతాల్లో రోడ్డు మరీ దారుణంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోజు రోజుకూ అధ్వానంగా మారుతున్నట్లు స్థానిక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వాహనాలతో రద్దీ

ఈ రహదారి ఆకివీడు వెళ్లేందుకు దగ్గరి మార్గం కావడంతో గణపవరం మీదుగా ఆకివీడు, కైకలూరు వెళ్లే భారీ వాహనాలు ఈ రహదారి వెంబడే వెళుతుంటాయి. గణపవరం నుంచి ఉండి మీదుగా ఆకివీడు వెళ్లాలంటే మరో 7 కిలోమీటర్ల వరకూ దూరం పెరుగుతుంది. దీంతో ఈ రహదారిపై ట్రాఫిక్ సమస్య కూడా ఉంది. ఈ రహదారి వెంబడే కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండటంతో ఉదయం సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులతో ఎదురెదురు వాహనాలు తప్పించుకోవడంతో ఇబ్బందులుపడుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. అసలే ట్రాఫిక్ సమస్య దీనికి తోడు రోడ్డు గుంతలతో ఉండడం వలన ప్రయాణికులు ఈ మార్గంలో వెళ్లాలంటే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం

వైఎస్సార్ సీపీ హయాంలో 2023లో గణపవరం నుంచి ఉప్పరగుడెం వరకూ ఈ ఆర్అండ్‌బీ రహదారిని రూ.3 కోట్ల నిధులతో నిర్మించారు. ప్రభుత్వం మారిన తరువాత ఈ రహదారి నిర్వహణపై పాలకులు ఎటువంటి శ్రద్ధ పెట్టకపోవడంతో ఈ రోడ్డు రోజు రోజుకూ మరమ్మతులకు గురవుతోందని స్థానికులు చెబుతున్నారు. బావాయిపాలెం నుంచి క్రొవ్విడి శివారు 8 చోట్ల ఈ రహదారి ఇరువైపులా కుంగిపోయి ప్రమాదకరంగా ఉందని బావాయిపాలెం గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పెద్ద ప్రమాదాలు జరగకుండా తక్షణం రహదారి మరమ్మతులు చేపట్టి, రోడ్డు మార్జిన్‌లోని గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



ఈ రహదారి వెంబడి తరచూ అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు మార్జిన్లు కుంగిపోతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు ప్రమాణం ప్రాణసంకటంగా ఉంది. వర్షం పడితే ఈ గుంతలు ఎంత లోతులో ఉన్నాయో తెలియని పరిస్థితి.

– డీవీవీ మూర్తి, క్రొవ్విడి

నిర్వహణ లేక ప్రమాదకరం



రోడ్డు నిర్మాణం పూర్తయిన నాటి నుంచి నేటి వరకూ గత రెండేళ్లుగా ఈ రోడ్డు నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో రోజు రోజుకీ ఈ రహదారి ప్రమాదకరంగా మారుతోంది. 8 చోట్ల వాహనాలు ఏ విధంగా వెళ్లాలో తెలియడం లేదు. రోడ్డు కుంగిపోయిన చోట తక్షణం జేసీబీలతో ఎత్తు పల్లాలు సరి చేయాలి.

– కోడే కాశి, జెడ్పీటీసీ

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

గణపవరం నుంచి క్రొవ్విడి శివారు వరకూ ఈ రహదారి మరమ్మతులు చేసేందుకు రూ.1 కోటి నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వాటిని ఉన్నతాధికారులకు పంపిస్తాం. ఆ నిధులు మంజూరయ్యే లోపు తాత్కాలిక మరమ్మతులు చేపడతాం.

– జె.భాస్కరరావు, ఏఈ, ఆర్అండ్‌బీ

రైతులకు అండగా నిరసన కార్యక్రమం



ఓరుగంటి నాగేంద్ర

జంగారెడ్డిగూడెం: రైతులకు యూరియా సమృద్ధిగా సరఫరా చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాధరావు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నామన్నారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు జంగారెడ్డిగూడెంలోని జెట్టి గురునాధరావు కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని, నిరసన తెలిపి, ఆర్డీవోకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు, రైతులు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో కట్టవపాదలగూడెం, అమ్మపాలెం గ్రామాలకు 3 ఫేజ్ 24 గం లైన్ వేయు నిమిత్తం, చక్రదేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. చక్రదేవరపల్లి గ్రామానికి, చుట్టుపక్కల ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ, వ్యవసాయ, కమర్షియల్ అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాల్సినదిగా కోరారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం సబ్ స్టేషన్ నుంచి వెళ్ళే కన్నాపురం, కన్నాయిగూడెం, పవర్ గ్రిడ్ ఫీడర్ల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఫీడర్లపై ఉన్న అచ్యుతాపురం, రేపల్లె వాడ, కొయ్యలగూడెం టౌన్‌లోని అశోక్ నగర్, కన్నాపురం రోడ్డు, అంకాలగూడెం, కన్నాపురం, కన్నాయిగూడెం ఫీడర్లపై వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

కార్మికుల హామీలను అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం: సీఐటీయూ పట్టణ, మండల మహాసభ స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికుల పోరాటాల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ, ఇటీవల ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం స్వాగతిస్తూ దీనివలన ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 25 వేలు ఇవ్వాలని కోరారు. తొలుత సీఐటీయూ జెండాను సీనియర్ నాయకులు యు.సత్యన్నారాయణ ఆవిష్కరించారు. సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా పి.సూర్యారావు, కో.కన్వీనర్లుగా జి.విమల, వి.శిరోమణిలను మరో 12 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కాపు విద్యా ట్రస్ట్ ఏర్పాటుకు ఆమోద ముద్ర

ద్వారకాతిరుమల: స్థానిక కాపు కల్యాణ మండప ట్రస్ట్‌కు అనుబంధంగా విద్యా ట్రస్ట్ ఏర్పాటు చేయాలని పాలకవర్గ మండలి నిర్ణయించింది. కాపు కల్యాణ మండపంలో ట్రస్ట్ చైర్మన్ పుప్పాల వాసుబాబు అధ్యక్షతన ఆదివారం ట్రస్ట్‌బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండప అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించి, ఆమోదించారు. అందులో భాగంగా విద్యా ట్రస్ట్ కమిటీ ఏర్పాటుకు, అలాగే ఏసీల మరమ్మతులు, నూతన ఏసీల కొనుగోలుకు ఆమోదముద్ర వేశారు. పోలసానిపల్లి హైవే బ్రిడ్జి వద్ద నుంచి ద్వారకాతిరుమల క్షేత్రం వరకు కాపు కల్యాణ మండప సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాపు కల్యాణ మండప వర్కింగ్ ప్రెసిడెంట్ చినిమిల్లి వెంకటరాయుడు, వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, కార్యదర్శి పల్నాటి శివరామ్ ప్రసాద్(బుజ్జి), ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు, స్థలదాత పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణారావు, సభ్యులు చుండూరి వెంకట్రావు, పాశం రామాంజనేయులు, వంగా రఘు, నూకల రామకృష్ణ తదతరులున్నారు.

160 మందికి కంటి పరీక్షలు

గణపవరం: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తగిన వైద్య సహాయం పొందాలని నేత్ర వైద్యురాలు జి.శ్వేత అన్నారు. ఆదివారం గణపవరంలోని ఎంజీ కంటి ఆసుపత్రిలో జ్ఞానానంద కంటి వైద్యశాల ఆధ్వర్యంలోఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంజీ కంటి ఆసుపత్రి వైద్యుడు ఎం.శ్రీను, రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం: చదువు మధ్యలో ఆపేసిన వారు చదువుకోవడానికి దూరవిద్య ఉపయోగపడుతుందని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు ఎం.రాజేష్, జి.బాలయ్య అన్నారు. ఆదివారం గణపవరంలో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించబడుతున్న దూరవిద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు విధ వృత్తులు, ప్రైవేట్ పనులు చేసుకుంటూ తమ చదువును కొనసాగించడానికి దూరవిద్య ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పాఠశాల హెచ్ఎం వీరవేణి, నంబర్–1 ఆదర్శ పాఠశాల హెచ్ఎం ఎంఎస్ఎల్ ఎస్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.